క్లుప్తంగా

నేడు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: వరంగల్ రంగశాయిపేట వాటర్ ట్యాంకులో మిషన్ భగీరథ మరమ్మతు పనులు కొనసాగుతున్నందున మంగళవారం నీటి సరఫరా ఉండదని బల్దియా ఈఈ శ్రీరామోజు శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు రంగశాయిపేట వాటర్ ట్యాంకు పరిధిలోని రంగశాయిపేట, శంభునిపేట, విశ్వనాథకాలనీ, గణేష్‌నగర్, నాయుడు పెట్రోల్‌పంపు, లెనిన్‌నగర్, సాయినగర్, మైసయ్యనగర్ ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

కాంగ్రెస్ వరంగల్ సిటీ మహిళా అధ్యక్షురాలిగా శ్రీలత



వరంగల్: కాంగ్రెస్ వరంగల్ సిటీ మహిళా అధ్యక్షురాలిగా నగరంలోని కరీమాబాద్‌కు చెందిన చెందిన బొౌరిశెట్టి శ్రీలతను జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆదేశాల మేరకు నియమించినట్లు మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ తెలిపారు. ఈమేరకు నియామక ఉత్తర్వులను హనుమకొండలోని ఎర్రబెల్లి స్వర్ణ ఇంటిలో శ్రీలతకు సోమవారం అందజేశారు. కాగా, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన స్వర్ణ, పార్వతమ్మకు శ్రీలత కృతజ్ఞతలు తెలిపారు.

ఆ నిధులను ఏం చేశారు?



కాజీపేట అర్బన్: గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్‌లోని న్యూశాయంపేటకు స్మార్ట్ సిటీ పథకం కింద కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.196 కోట్లను ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఎటువైపు మళ్లించారని బీజేపీ నాయకులు ప్రశ్నించారు. ఈమేరకు న్యూశాయంపేట చౌరస్తాలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడు రామిండ్ల బాబురావు ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది క్రితం న్యూశాయంపేట ఇందిరాగాంధీ విగ్రహం నుంచి రైల్వే గేట్ వరకు రోడ్డు నిర్మాణానికి ఆర్భాటంగా చీఫ్‌విప్ శంకుస్థాపన చేసిన పనులు ఎక్కడివి అక్కడే ఉన్నాయని విమర్శించారు. దాంతో రోడ్డు లేక న్యూశాయంపేట వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ ఎక్కడ?

హన్మకొండ: హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరమైన వరంగల్ మహానగరంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం ఏమైందని, ఇచ్చిన హామీని నిలుపుకోవడంలో సీఎం కేసీఆర్ విఫలం చెందారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి విమర్శించారు. ఈమేరకు హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌కు నాలుగో బహిరంగ లేఖను రాకేష్‌రెడ్డి సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర జనాభా ప్రస్తుతం 12 లక్షలు దాటిందని, పెరిగిన జనాభాకు అనుగుణంగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అండర్ గ్రౌడ్ నిర్మాణాన్ని మంత్రి కేటీఆర్, చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ పట్టించుకోవడం లేదన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలి



కాజీపేట: విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే ఉద్యోగావకాశాలు వాటంతటవే వస్తాయని తాళ్ల పద్మావతి విద్యా సంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం అన్నారు. కాజీపేట మండలం సోమిడి గ్రామ శివారులోని తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను సోమవారం ప్రారంభించారు. జాతీయ, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన 16 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ గల 350 మందికి ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ తాళ్ల వంశీ, తాళ్ల చైతన్య, ప్రిన్సిపాల్ డాక్టర్ వేలు రామస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిన్నారులకు బహుమతి

హన్మకొండ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ రాజమండ్రికి చెందిన శ్రీరాధాకృష్ణ ట్రస్ట్, శ్రీరాధాకృష్ణ కళాక్షేత్రం ఆధ్వర్యంలో జాతీయస్థాయి సంగీత నృత్య పోటీలు –2023 (కళా సమ్మేళన్) ఈనెల 22నుంచి 25వరకు జరిగాయి. ఈక్రమంలో నగరానికి చెందిన చిన్నారులు కూచిపూడి నృత్యవిభాగంలో బహుమతి అందుకున్నారు. ఈమేరకు హనుమకొండ గోపాల్‌పురంలోని శ్రీదుర్గ నృత్యాలయం నిర్వహకురాలు గంప శైలజశరత్ శిష్య బృందం వడ్లమూడి రేవ, ఎం.యశస్వి, జి.చన్విత, ఎం.చిద్రుపి, కే.వైష్ణవి ద్వితీయ బహుమతి అందుకున్నారు. రాజమండ్రిలోని శ్రీవేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో ఆదివారం జరిగిన పోటీల ముగింపు కార్యక్రమంలో చిన్నారులకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు నృత్య గురువు శైలజశరత్ అభినందనలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతులు



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న పెన్షనర్లు



వినతిపత్రం ఇస్తున్న ఎంసీపీఐ నాయకులు



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హన్మకొండ అర్బన్: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ సంఘం (టీఎస్‌జీఆర్ఈఏ) రాష్ట్ర కార్యదర్శి తిరువరంగం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ సాధన ఉద్యమంలో కీలక భూమిక పోషించిన తెలంగాణ పెన్షనర్లు.. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు నేడు రోడ్డెక్కడం బాధాకరమని వాపోయారు. ఈక్రమంలో పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

హన్మకొండ అర్బన్: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి ఎస్‌రెడ్డి హంసరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా హంసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న పేదలందరికీ పట్టాలు ఇవ్వాలని సూచించారు. ఇంటిబంధు పథకం ప్రవేశపెట్టి ప్రతీపేద కుటుంబానికి రూ.10 లక్షలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నీల రవీందర్, రాష్ట్ర కమిటీ సభ్యులు పరికరాల భూమయ్య, మాస్ సావిత్రి, ఏఐఎఫ్‌డీఎస్ విద్యా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం శంకర్, ఎలిషా ప్రభాకర్, గణేష్, సమ్మయ్య, శిరీష, రామ్మోహన్, మధు, తిరుపతిరావు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మిశ్రీన్ సుల్తానా, మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో కలెక్టరేట్ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడి 9ఏళ్లు గడిచినా ఇప్పటి వరకు ప్రభుత్వ విద్యారంగ సమస్యలు పరిష్కారం కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కళ్యాణ్, సహాయ కార్యదర్శి అనూష స్టాలిన్, మడికొండ ప్రశాంత్, సాయి, గణేష్, నాగరాజు, మధు, ప్రదీప్, ప్రవళిక, అంజలి, శిరీష, అనూష పాల్గొన్నారు.

పిల్లలను వీధికుక్కలు పీక్కుతింటున్నాయి

వరంగల్ అర్బన్: చిన్న పిల్లలు, వృద్ధులను వీధి కుక్కలు పీక్కుతింటున్నాయని, అయినా బల్దియా తరపును చర్యలు శూన్యమని బీఎస్పీ నాయకులు నిరసన తెలిపారు. ఈమేరకు తగు చర్యలు తీసుకోవాలని బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. రోజురోజుకు వీధి కుక్కల బీభత్సం ఎక్కువవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఈసీ సభ్యుడు బొట్ల కార్తీక్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద శ్యామ్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జన్ను అనిల్, నాయకులు మహేందర్, నాయకులు జన్ను నీలిమ, శ్యాంసుందర్. ఎండీ.రఫి, లోకేష్, రాజ్‌కుమార్, ఎండీ.అబీద్ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహిళలకు తోడ్పాటునందిస్తాం



మాట్లాడుతున్న ఆవుల శ్రీనివాస్

కాజీపేట అర్బన్: మహిళల రక్షణకు విజయ సంకల్ప సోషల్ సర్వీస్ సొసైటీ తోడ్పాటునందిస్తుందని సొసైటీ వ్యవస్థాపకుడు ఆవుల శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. 31వ డివిజన్ పరిధి న్యూశాయపేటలోని పద్మశాలి సంఘ భవన్‌లో సఖి వన్‌స్టాప్ సెంటర్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన మహిళా చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలకు ఆపద ఎదురైనప్పుడు ఎన్జీవోస్ లేదా సఖి వన్‌స్టాప్ సెంటర్‌కు సమాచారం అందిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. సఖి సెంటర్ కేస్ వర్కర్ హరిత మాట్లాడుతూ నిర్భయ ఘటన తర్వాత మహిళల రక్షణకు సఖి వన్‌స్టాప్ సెంటర్లు ఏర్పడ్డాయని వివరించారు. కార్యక్రమంలో సఖి సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నివారణకు కృషిచేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్, విద్యార్థులు

మామునూరు: ఆరోగ్యానికి హాని చేసే మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ పాటుపడాలని ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ సూచించారు. సీపీ రంగనాథ్ ఆదేశాలు, ఏసీపీ కృపాకర్ సూచనల మేరకు అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఖిలా వరంగల్ మండలం మామునూరు జాతీయ రహదారిపై మామునూరు పోలీస్‌స్టేషన్ ఎస్సైలు కృష్ణవేణి, రాజేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి డ్రగ్స్ నిర్మూలనపై పోలీసులు సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ గంజాయి, మద్యానికి యువత దూరంగా ఉండాలని సూచించారు. మామునూరు జంక్షన్ నుంచి టీఎస్ఎస్పీ బెటాలియన్ ప్రధాన గేటు వరకు పోలీసులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

సంక్షిప్తంగా

చదువుకు పేదరికం అడ్డుకాదు

హసన్‌పర్తి: చదువుకు పేదరికం అడ్డుకాదని అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ సెక్రటరీ అరూరి విశాల్ అన్నారు. హసన్‌పర్తి మండలం పెంబర్తి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు షూ, టై, బెల్ట్‌ల నిమిత్తం రూ.18వేల చెక్కును అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతపాక సునీత, జెడ్పీటీసీ సభ్యురాలు రేణుకుంట్ల సునీత, పీఏసీఎస్ చైర్మన్లు ఉదయ్‌కుమార్‌రెడ్డి, వనంరెడ్డి, జక్కు రమేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, మన బడి – మన బాధ్యత నియోజకవర్గ కన్వీనర్ దోమ కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలో మృతిచెందిన నగరంలోని ఒకటవ డివిజన్ ముచ్చర్లకు చెందిన మట్టెడ లచ్చమ్మ మృతదేహాన్ని బీఆర్ఎస్ నాయకులు సోమవారం సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతురాలి అంత్యక్రియలకు బాధిత కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ నాయకుడు వెంకటేశ్వరరెడ్డి రూ.3వేలు అందించారు. బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సూర ప్రమోద్, నాయకులు పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావుకు వైద్యుల సన్మానం

ఎంజీఎం: సిద్దిపేటలో తెలంగాణ పల్లె దవాఖాన వైద్యులు ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్ రావుకు బీఏఎంఎస్ వైద్యులు జ్ఞాపిక అందించి సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ పల్లె దవాఖాన రాష్ట్ర అసోసియేషన్ సభ్యులు డాక్టర్ అరుణ్‌కుమార్, అజయ్‌కుమార్, సురేష్, మహేందర్, శ్రీనివాస్, విజయ, చాముండేశ్వరి పాల్గొన్నారు.

లార్డ్స్ వృద్ధాశ్రమంలో అన్నప్రసాదాల వితరణ

హన్మకొండ కల్చరల్: ఉత్తర నక్షత్రాన్ని పురస్కరించుకుని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ హనుమకొండ జిల్లా కమిటీ సౌజన్యంతో హనుమకొండ భీమారంలోని లార్డ్స్ వృద్ధాశ్రమంలో అన్నప్రసాదాల వితరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గురుస్వామి నాగిళ్ల శరత్‌శర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ చేశారు. అనంతరం వృద్ధులకు అన్నప్రసాదాలు అందజేశారు.

రైల్వే సంఘం నాయకుడు వీరయ్యకు నివాళి

కాజీపేట: మాజీ కార్పొరేటర్ సుంచు అశోక్ తండ్రి, రైల్వే కార్మిక సంఘం నాయకుడు, రిటైర్డ్ టీటీఈ సుంచు వీరయ్య అనారోగ్య సమస్యలతో కాజీపేట 63వ డివిజన్ సోమిడి రోడ్డులో సోమవారం మృతి చెందారు. ఈ సందర్భంగా వీరయ్య మృతదేహం వద్ద డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్లు దాస్యం అభినవ్‌భాస్కర్, విజయశ్రీ, జక్కుల రవీందర్, టీపీసీసీ కార్యదర్శి సయ్యద్ రజాలీ, జిల్లా ఆర్టీఏ కమిటీ సభ్యుడు రాజు నివాళి అర్పించారు.

రెగ్యులరైజ్ చేయాలని వినతి



కేయూ క్యాంపస్: కేయూ పార్ట్‌టైం అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని అసోసియేషన్ బాధ్యులు కోరారు. ఈమేరకు కేయూ పరిధిలోని వివిధ కళాశాలలో పనిచేస్తున్న పార్ట్‌టైం లెక్చరర్స్ యూనివర్సిటీ పార్ట్‌టైం లెక్చరర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సొల్తి కిరణ్‌గౌడ్ ఆధ్వర్యంలో యూనివర్సిటీలోని హ్యూమానిటీస్ బిల్డింగ్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలపై చర్చించారు. రెగ్యులరైజ్ చేసేవరకూ రోజూ వివిధ రూపాల్లో నిరసన తెలపాలని నిర్ణయించారు. అనంతరం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ దేవజీ నాయక్, బాధ్యులు డాక్టర్ భాగ్యమ్మ, డాక్టర్ వీరేందర్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ కుమార్, డాక్టర్ సుధీర్, డాక్టర్ వినోద, డాక్టర్ సీతక్క, డాక్టర్ శ్యాం సుందర్‌చారి, రవీందర్, మహేందర్, రజనీకాంత్, పూజిత, రజిత తదితరులు పాల్గొన్నారు.

కేయూలో కాంట్రాక్టు లెక్చరర్ల ధర్నా

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని 13 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ (కుక్టా) ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీలోని కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేసినట్లుగానే యూనివర్సిటీ కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని సూచించారు. కార్యక్రమంలో కుక్టా బాధ్యులు ఆర్‌డీ ప్రసాద్, జరుపుల చందులాల్, అనిల్‌కుమార్, వీణ, మధుకర్‌రావు, గడ్డం కృష్ణ, కల్పన, స్వప్న, చీకటి శ్రీనివాస్, శ్రీలత, సంతోష్, దయాకర్, ప్రసన్న, రమేష్, రాణి, లక్ష్మణ్‌నాయక్, రాజన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి ఆయుర్వేద డాక్టర్ 'పాములపర్తి'

హన్మకొండ: బీఆర్ఎస్‌లో ఆయుర్వేద డాక్టర్ పాములపర్తి రామారావు చేరనున్నారు. ఇటీవల వరంగల్ పర్యటనకు వచ్చిన మంత్రి కేటీఆర్‌ను రామారావు కలిశారు. ఈ క్రమంలో ఆయన బీఆర్ఎస్‌లో చేరేందుకు నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. త్వరలో చీఫ్‌విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ నేతృత్వంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోనున్నారు.

అన్ని రంగాల్లో వెనుకబడిన ముస్లింలు



సమావేశంలో మాట్లాడుతున్న ఖుస్రుపాషా

న్యూశాయంపేట: ముస్లిం, మైనార్టీలు విద్యా, వైద్యం, ఆర్థిక రంగాల్లో వెనుకబడి ఉన్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందచేస్తున్న పలు పథకాలు వారికి అందేలా చూడాలని గ్రేటర్ పరిధిలోని మసీదు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఇమామ్, మౌజన్‌ను మిల్లత్ రాబ్తా కమిటీ అధ్యక్షుడు, కాజీపేట అఫ్జల్ బియాబాని దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా కోరారు. హనుమకొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మసీదు కమిటీ బాధ్యులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ఆదివారం రాత్రి సమావేశం జరిగింది. రాబ్తా కమిటీ బాధ్యులు సయ్యద్ దస్తగిర్, ముఫ్తీ మినాజ్, అబ్దుల్ ఖార్, అతీఖుర్ రహమాన్, ఖాలీద్ సయిద్, అబ్దుల్ ఖుద్దూస్, నయీమొద్దీన్, మహ్మద్ ఖాలీఖ్ తన్వీర్, అబ్దుల్లా, మహ్మద్ షకీల్ అహ్మద్, మసీదు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రానున్నది కాంగ్రెస్ సర్కారే



పార్టీలో చేరిన వారితో శ్రీనివాస్, తదితరులు

హసన్‌పర్తి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ కోఆర్డినేటర్ నమిండ్ల శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు. 65వ డివిజన్ దేవన్నపేటకు చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో సోమవారం చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి శ్రీనివాస్ ఆహ్వానించారు. అనంతరం పార్టీ నూతన కమిటీల నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని సూచించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు భాస్కర్, జిల్లా కమిటీ సభ్యుడు పోలెపల్లి రవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ దేవన్నపేట గ్రామ కమిటీ ఎన్నిక

కాంగ్రెస్ దేవన్నపేట గ్రామశాఖ అధ్యక్షుడిగా మల్లేశం, ఉపాధ్యక్షుడిగా చుంచు నరేష్, కార్యదర్శిగా మోహన్, కోశాధికారిగా బుచ్చిరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడిగా శ్రీపతి చేరాలు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నందపాక కుమార్, యూత్ అధ్యక్షుడిగా చుంచు పూర్ణను ఎన్నుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు



సర్వే చేస్తున్న విద్యుత్ అధికారులు

హసన్‌పర్తి: విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులు సమాయత్తమయ్యారు. ఈమేరకు 1వ డివిజన్, 66వ డివిజన్లలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై డీఈఈ సామ్యానాయక్ ఆధ్వర్యంలో సోమవారం సర్వే నిర్వహించారు. ఐదు దశాబ్దాల క్రితం ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఇనుప స్తంభాలను పరిశీలించారు. ధ్వంసమైన ఇనుప స్తంభాలను తొలగించి వాటి స్థానంలో సిమెంట్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు. నిరుపయోగంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని నిర్ణయించారు. కొత్తగా నిర్మిస్తున్న ఉమ్మడి శ్మశాన వాటిక వద్ద విద్యుత్‌స్తంభాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏడీ గంగారెడ్డి, ఏఈ మంగమ్మ, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, దేవస్థాన మాజీ ధర్మకర్త కోటి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

వరంగల్ చౌరస్తా: బీజేపీతో ఇంటింటా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ నాయకులు తెలిపారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వరంగల్ తూర్పు నియోజకవర్గం 28వ డివిజన్ ఆంధ్ర బాలిక స్కూల్ నుంచి పోస్టాఫీస్ వరకు సోమవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కట్ట ఈశ్వర ప్రసాద్, పోలెపాక మార్టిన్ లూథర్, పుప్పాల రాజేందర్, మాదాసు రాజు, వెంకట్, చిలువేరు రాజేందర్, అంకాల జనార్దన్, కొత్తపల్లి రాజేష్, బోడ విజయకుమార్, సదానంద గౌడ్, ముత్తినేని శ్రీనివాస్, నాగరాజు, కోట సతీష్, సోమేశ్వర వర్మ పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో ముందుండాలి



ఖిలా వరంగల్: విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఈఓ వాసంతి, తదితరులు



కాశిబుగ్గ: గుడిబడిలో ప్రార్థన సమయంలో విద్యార్థితో పఠనం చేయిస్తున్న ఉపాధ్యాయులు

ఖిలా వరంగల్: విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకుని ముందుండాలని వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి సూచించారు. పఠనోత్సవ కార్యక్రమాన్ని ఉర్సు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ప్రారంభించారు. అనంతరం, అమెరికాలో స్థిరపడిన రంగశాయిపేటకు చెందిన కెంచ కుమారస్వామి – లక్ష్మి దంపతుల పిల్లలు నవీన్, ప్రవీణ్, దివ్య ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, స్టేషనరీ అందజేయగా, స్థానిక కార్పొరేటర్ గుండు చందనతో కలిసి విద్యార్థులకు డీఈఓ పంపిణీ చేశారు. హెచ్‌ఎం నలిని, కృష్ణమూర్తి, రమేష్‌బాబు, సుహాసిని, రాజు, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పఠనం అలవాటు చేసుకోవాలి

కాశిబుగ్గ: ప్రతీ విద్యార్థికి చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని బాల సాహిత్యం రాష్ట్ర పూర్వ విషయ నిపుణుడు అజయ్‌బాబు సూచించారు. కాశిబుగ్గ నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గుడిబడి)లో పఠనోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమారస్వామి, సిరినాయక్, శ్రవణ్‌కుమార్, వీరభద్రం, సుధ, కళావతి, సుజాత, కరుణ, రమేష్ తదితరుల పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



ఏవీవీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బెంచీలు

వరంగల్ చౌరస్తా: వాసవి క్లబ్ వరంగల్, వాసవి క్లబ్, డాక్టర్స్, వాసవి క్లబ్ అభ్యుదయ, వాసవి క్లబ్ ప్రతాపరుద్ర, వాసవి క్లబ్ వర్ధనపేట, వనిత, వాసవి క్లబ్ క్వీన్స్, వనిత హనుమకొండ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ రీజియన్ చైర్మన్ డాక్టర్ వల్లా పృథ్వీరాజ్ తెలిపారు. గత రెండు రోజులుగా చేపట్టిన ఈ కార్యక్రమాలకు వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ అదనపు కోశాధికారి పుల్లూరి ప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరైనట్లు పేర్కొన్నారు. ఉదయాస్తమన సేవలో భాగంగా 12సిమెంట్ బెంచీలను రామసత్యనారాయణ స్వామి దేవస్థానం, త్రివేద లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం, ఏవీవీ జూనియర్ కళాశాల, పోతన విజ్ఞాన పీఠంలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. అలాగే, 60మంది పేదలకు చీరలు, దోతీలు, ఏడుగురికి నెలకు సరిపడా బియ్యం, నిత్యావసరాలు, జై జవాన్, జై కిసాన్ నినాదం మేరకు ఆరుగురు రైతులకు వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, పురుగు మందులు పంపిణీ చేశారు.

బోనాలకు బందోబస్తు ఏర్పాటు చేయాలి



ఏసీపీకి వినతిపత్రం అందజేస్తున్న కమిటీ బాధ్యులు

కరీమాబాద్: కరీమాబాద్ బీరన్న స్వామి దేవాలయంలో ఈనెల 29న జరుగనున్న బోనాల పండుగకు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు వరంగల్ ఏసీపీ బోనాల కిషన్‌ను సోమవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రతీఏటా తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బీరన్న స్వామికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. భక్తుల కారణంగా ఇబ్బందులు తలెత్తే అవకాశమున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాటు చేయాలని ఏసీపీని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కోరె కృష్ణ, కోరె నాగరాజు, కోశాధికారి నరిగె లక్ష్మణ్, కోరె కుమారస్వామి, నరిగె శ్రీను, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు కార్యాచరణ



నయీంనగర్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయమై చర్చించేందుకు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా బ్యూరో చీఫ్‌లు, స్టాఫ్ రిపోర్టర్లతో సిక్స్ మెన్ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించింది. ఈ సందర్భంగా సిక్స్ మెన్ కమిటీ సమన్వయకర్త టీయూడబ్ల్యూజే(143) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్.లెనిన్, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, టీయూడబ్ల్యూజే(143) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎం.సుధాకర్, టీయూడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.దయాసాగర్, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బి.సదయ్య హాజరయ్యారు. అందరి సూచనలు మేరకు ముందుకు వెళ్తామని కమిటీ హామీ ఇచ్చింది.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్సై దివ్య

మడికొండ: మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని రొట్టెబండ కాలనీలోని ప్రజలకు సైబర్ నేరాలపై పోలీసులు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై దివ్య మాట్లాడుతూ అపరిచితుల నుంచి ఫోన్‌కు వచ్చే మెసేజ్‌లు, లింక్స్, కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. అలాగే, ఓటీపీని ఎవరితోనూ పంచుకోకూడదని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైనట్లు గ్రహిస్తే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ జయరాజ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.